క్లుప్తంగా

వైఎస్సార్ సీపీ నేతల విస్తృత ప్రచారం



తాడేపల్లిరూరల్: తాడేపల్లి పట్టణ పరిధిలోని వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు బుర్రముక్కు వేణుగోపాల సోమిరెడ్డి ఆధ్వర్యంలో 4వ సచివాలయం పరిధిలోని ఎన్టీఆర్ కరకట్ట నుంచి క్రిస్టియన్ పేట వరకు వైఎస్సార్ సీపీ గుంటూరు పార్లమెంట్ అభ్యర్థి కిలారి వెంకట రోశయ్య, మంగళగిరి ఎమ్మెల్యే అభ్యర్థి మురుగుడు లావణ్యల విజయాన్ని కాంక్షిస్తూ గురువారం రాత్రి ప్రచారం నిర్వహించారు. వేణుగోపాల సోమిరెడ్డి మాట్లాడుతూ జగనన్న ప్రవేశపెట్టి సంక్షేమ పథకాల వల్ల ఎంతోమంది పేదల జీవన విధానంలో మార్పు వచ్చిందన్నారు. మే 13న జరిగే ఎన్నికల్లో కిలారి వెంకట రోశయ్య, మురుగుడు లావణ్యలను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్లు సంకుర అశోక్, దాసరి కుమారి, ఇసుకపల్లి అనిల్, గుంటూరు జిల్లా జేసీఎస్ కన్వీనర్ ఈదులమూడి డేవిడ్‌రాజు, నాయకులు కళ్లం రాజశేఖర్‌రెడ్డి, గరుగు శ్రీనివాస రెడ్డి, తాడేపల్లి రైతు విభాగం కన్వీనర్ బంధపు రుక్మాంగరెడ్డి, మేకా శివప్రసాద్ రెడ్డి, ఇసుకపల్లి ఏసోబు, కుమారి, బడుగు కవిత, సతీష్, వేముల జ్యోతి, బుగ్గయ్య, రాజీనామాలు చేసిన వలంటీర్లు, తదితరులు పాల్గొన్నారు.

గ్రూప్-2 ప్రిలిమ్స్‌లో కేఎల్‌యూ విద్యార్థుల విజయబావుటా

తాడేపల్లిరూరల్: తాడేపల్లి రూరల్ వడ్డేశ్వరం కేఎల్ యూనివర్సిటీ విద్యార్థులు గ్రూప్-2 ప్రిలిమ్స్ ఫలితాల్లో విజయ బావుటా ఎగురవేసినట్లు గురువారం వర్సిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ జి.పార్థసారథి వర్మ ఒక ప్రకటనలో తెలిపారు. కేఎల్ విశ్వవిద్యాలయంలో బీఏ (ఐఏఎస్) కోర్సుల్లో చదివిన జనరల్ నాలెడ్జ్, సిశాట్‌లు తమ విద్యార్థుల విజయానికి ఎంతగానో దోహదం చేశాయన్నారు. బీఏ (ఐఏఎస్) విభాగాధిపతి డాక్టర్ బి.శివనాగయ్య ఆన్‌లైన్‌లో ఏర్పాటు చేసిన సుమారు 60 తరగతుల కరెంట్ అఫైర్స్ విజ్ఞానం వారి విజయానికి దోహపడిందని, విద్యార్థులందరికీ ప్రతిరోజు ఇంగ్లిష్ పేపర్ ఇచ్చి విశ్లేషణ చేయించడం, ప్రతి విద్యార్థిని ప్రధాన సబ్జెక్టులకు సంబంధించిన పుస్తకాలను ఉచితం అందించడం, 365 రోజులు లైబ్రరీ అందుబాటులో ఉంచడంతో ఈ విజయం సాధించినట్లు వీసీ డాక్టర్ జి.పార్థసారథి ఆ ప్రకటనలో తెలిపారు.

శాస్త్రోక్తంగా ధాన్యాధివాసం



ప్రత్తిపాడు: అంకమ్మతల్లి ఆలయ ప్రతిష్టా మహోత్సవాలు నేత్రపర్వంగా జరుగుతున్నాయి. మహోత్సవాల్లో భాగంగా మూడవ రోజు గురువారం నిత్యపూజ, క్షీరాధివాసం, వాస్తు పూజ, పంచామృతాదివాసం, సుగంధ ద్రవ్య స్నపనం, సముద్రోధక అభిషేకం, ఆదివాసం హోమం, మధ్యాహ్నం నవగ్రహ ఆరాధన, సాయంత్రం ప్రధాన కలశవాహన సాలీర్చన, రాత్రి క్షీరతర్పణం, న్యాసకళ, అంగ, ప్రత్యంగ, అధివాస, ధాన్య, పుష్ప వస్త్రాధివాసములను అత్యంత వేడుకగా నిర్వహించారు. దాన్యాధి వాసానికి గ్రామస్తులు తమ ఇంటి నుంచి ధాన్యాన్ని సమర్పించారు. అనంతరం దర్బార్ సేవ, వేద పారాయణం జరిగాయి. ప్రత్యేక యజ్ఞయాగాదులు, హోమాలను చేశారు.

కొమ్మమూరు కాల్వకు జలకళ

తాగునీటి అవసరాలకు చెరువులకు నీరు



చేబ్రోలు: ప్రస్తుత వేసవిలో ప్రజల తాగునీటి అవసరాల కోసం కొమ్మమూరు చానల్‌కు నీరు విడుదల చేయటంతో గురువారం చేబ్రోలు మండలంలోని వివిధ గ్రామాల్లోని చెరువులకు నీరును ఇంజన్ల ద్వారా మళ్లించారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ ఏడాది తగినంత వర్షపాతం లేకపోవటంతో ప్రాజెక్ట్‌లో నీటి నిల్వలు గణనీయంగా తగ్గాయి. వేసవిలో ఎండ తీవ్రత పెరగడంతో తాగునీటి చెరువుల్లోని నీటి మట్టాలు తగ్గిపోయాయి. ప్రకాశం బ్యారేజ్ నుంచి తాగునీటి అవసరాల కోసం నీటిని విడుదల చేయటంతో కాలువల ద్వారా వచ్చే నీటితో చెరువుల్లో నీటిమట్టంను పెంచటంతో తాగునీటి ఎద్దడి లేకుండా అధికారులు ముందు జాగ్రత్త చర్యలు చేపట్టారు. మేజర్ గ్రామ పంచాయతీ చేబ్రోలు, గొడవర్రు, నారాకోడూరు, వేజెండ్ల గ్రామాల్లోని మంచి నీటి చెరువులు ద్వారా ప్రజలకు తాగునీరు సరఫరా జరుగుతుంది. ఈ గ్రామాల పరిధిలో గ్రామ సచివాలయ సిబ్బంది కాలువల్లోని నీటిని చెరువులకు ఇంజన్ల ద్వారా తరలించే ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు.

భక్తిశ్రద్ధలతో రంజాన్ వేడుకలు



బేతపూడి ఈద్గా వద్ద ప్రత్యేక ప్రార్థనలకు హాజరైన ముస్లింలు



పోలకంపాడు మసీదులో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

- ఈద్గాలు, మసీదుల వద్ద ముస్లింల ప్రత్యేక ప్రార్థనలు
- శుభాకాంక్షలు తెలియజేసిన ఎమ్మెల్యే ఆర్కే, ఎమ్మెల్సీ హనుమంతరావు, వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి లావణ్య

మంగళగిరి: నగరంలో రంజాన్ పండుగను గురువారం ముస్లిం మైనార్టీలు ఘనంగా జరుపుకొన్నారు. 41 రోజుల పాటు ఉపవాస దీక్షలు చేసిన ముస్లింలు గురువారం తెల్లవారుజామునే స్నానాలు ఆచరించి నూతన వస్త్రాలు ధరించి మసీదులలో ప్రార్థనలు నిర్వహించారు. ఒకరికొకరు ఆలింగనాలు చేసుకుంటూ శుభాకాంక్షలు తెలుపుకొన్నారు. రంజాన్ సందర్భంగా పట్టణంలోని పాతబస్టాండ్ వద్దగల జామియా మసీదులో జరిగిన ప్రత్యేక ప్రార్థనలలో ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే), ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావులు పాల్గొని ప్రార్థనల అనంతరం ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు. వైఎస్సార్ సీపీ నియోజకవర్గ అభ్యర్థి మురుగుడు లావణ్య ముస్లిం సాంప్రదాయ వస్త్రధారణలో ముస్లిం మహిళలతో కలిసి నిడమర్రు రోడ్డులోని అరవింద మోడల్ స్కూలులో జరిగిన ప్రార్థనలో పాల్గొని, ముస్లిం మహిళలకు శుభాకాంక్షలు తెలియజేశారు. మాజీ ఎమ్మెల్యే కాండ్రు కమల, వైఎస్సార్ సీపీ జిల్లా చేనేత విభాగం అధ్యక్షుడు మునగాల మల్లేశ్వరరావు, పట్టణ అధ్యక్షుడు ఆకురాతి రాజేష్, పట్టణ జేసీఎస్ కన్వీనర్ ఎండీ ఫిరోజ్, సంకె సునీత, గూండా మధు, గౌస్, సుభాని, మలక్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

ఫిరంగిపురంలో...

ఫిరంగిపురం: పవిత్ర రంజాన్‌మాసం నెలరోజుల కఠిన ఉపవాసాలు ఉన్న ముస్లింలు నెలవంకను చూసి గురువారంతో దీక్షలు విరమించారు. మండలంలోని వేములూరిపాడు, అమీనాబాద్, బేతపూడి, మునగపాడు, గుండాలపాడు, మేరికపూడి, 113 త్యాళ్లూరు, సుదురుపాడు, వేమవరం గ్రామాల్లో ముస్లింలు ఉపవాసాలు విరమించి రంజాన్ పండుగను ఘనంగా జరుపుకొన్నారు. బేతపూడిలోని ఈద్గావద్ద ఇమామ్ మస్తాన్‌వలి ఖురాన్ పఠనంగావించి, అల్లా గొప్పతనాన్ని వివరించారు. ఒకరినొకరు ఆలింగనం చేసుకుని శుభాకాంక్షలు తెలుపుకొన్నారు. కార్యక్రమంలో హాఫీజ్‌లు షేక్ ఉమర్, షేక్ ఇర్ఫాన్, షేక్ జబీబుల్లా, మసీద్, ముతవల్లిలు జాన్ ఖాజా, బాజీలు, మతపెద్దలు పాల్గొన్నారు.



మంగళగిరి జామియా మసీదులో ప్రార్థనలు నిర్వహిస్తున్న ముస్లింలు



ముస్లిం సాంప్రదాయ వస్త్ర ధారణలో శుభాకాంక్షలు తెలియజేస్తున్న లావణ్య



రాయపూడి ఈద్గాలో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

తాడేపల్లిలో...

తాడేపల్లిరూరల్: తాడేపల్లి పట్టణ, రూరల్, దుగ్గిరాల మండలాల్లో గురువారం అంగరంగ వైభవంగా రంజాన్ వేడుకలను నిర్వహించారు. మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం ఒకరినొకరు ఆలింగనం చేసుకుని ఈద్ ముబారక్ తెలియజేసుకున్నారు.



ప్రార్థనల్లో పాల్గొన్న ఎమ్మెల్యే ఆర్కే, ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు

తాడికొండలో...

తాడికొండ: రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకొని తాడికొండ, తుళ్లూరు మండలాల్లోని మసీదులు, ఈద్గాల్లో గురువారం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ముస్లిం మతపెద్దలు రంజాన్ సందేశాన్ని అందించి ప్రార్థనల్లో పాల్గొన్నారు. ఒకరినొకరు ఆలింగనం చేసుకొని శుభాకాంక్షలు తెలుపుకున్నారు. రంజాన్ సందర్భంగా గ్రామాల్లో పండుగ వాతావరణం నెలకొంది.

పూలే ఆశయాలే లక్ష్యంగా జగనన్న పాలన



జ్యోతిరావు పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే ఆర్కే, ఎమ్మెల్సీ హనుమంతరావు తదితరులు

- ఘనంగా మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి
- ఘననివాళులర్పించిన ఎమ్మెల్యే ఆర్కే, ఎమ్మెల్సీ మురుగుడు, వైఎస్సార్ సీపీ అభ్యర్థి లావణ్య

మంగళగిరి: సమ సమాజ స్థాపన కోసం నిరంతరం కృషి చేసిన నాయకుడు జ్యోతిరావు పూలే అని ఆయన బాటలో నడుస్తూ రాజ్యాధికారం అందరికీ సమానంగా దక్కేలా కృషి చేస్తున్న సీఎం జగన్ మోహన్‌రెడ్డి అని ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే) కొనియాడారు. జ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, వైఎస్సార్ సీపీ అభ్యర్థి లావణ్య, మాజీ ఎమ్మెల్యే కాండ్రు కమలలతో కలిసి పట్టణంలోని పార్కురోడ్డులోని ఎస్సీ, ఎస్టీ రైట్స్ యాక్ట్స్ కార్యాలయంలో పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన అనంతరం ఆత్మకూరు జాతీయ రహదారిపై వున్న అంబేడ్కర్, పూలే విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆర్కే మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి బడుగు బలహీనవర్గాలను చట్టసభలకు పంపి వారి అభివృద్ధే లక్ష్యంగా సీట్లు కేటాయించడం అభినందనీయమన్నారు. అందులో భాగంగా మంగళగిరి సీటు విద్యావంతురాలైన బీసీ మహిళ మురుగుడు లావణ్యకు కేటాయించారని, లావణ్య విజయానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. అంబేడ్కర్, జ్యోతిరావు పూలే ఆశయాలు నెరవేరాలంటే ప్రజలంతా వైఎస్సార్ సీపీ విజయానికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా చేనేత విభాగం అధ్యక్షుడు మునగాల మల్లేశ్వరరావు, ఎస్సీ ఎస్టీ రైట్స్ యాక్ట్స్ కార్యదర్శి కారుమంచి రామారావు, గరికముక్కు డేవిడ్, ఈపూరి ఆదామ్, పలువురు పాస్టర్లు పాల్గొన్నారు.



పూలే చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న జడ్జిలు వై.నాగరాజ, సీహెచ్‌వీ రామకృష్ణ

బార్ అసోషియేషన్ ఆధ్వర్యంలో...

జ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా పట్టణంలోని కోర్టు ఆవరణలోగల బార్ అసోషియేషన్ కార్యాలయంలో సీనియర్ సివిల్ జడ్జి వై.నాగరాజ, జూనియర్ సివిల్ జడ్జి సీహెచ్‌వీ రామకృష్ణ, అసోషియేషన్ అధ్యక్షుడు శృంగారపాటి బాల మురళీకృష్ణ పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి, ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో అసోషియేషన్ ప్రతినిధులు కుడారి శేఖర్‌బాబు, మాలపాటి సురేంద్ర, రెంటపల్లి రాజేష్, తాతా సాంబశివరావు, వింజమూరి భారతీ దేవి, గుర్రం రామారావు, పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.

టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలో చేరికలు

కండువాలు కప్పి ఆహ్వానించిన కిలారి రోశయ్య, లావణ్య

తాడేపల్లిరూరల్: దుగ్గిరాల మండల పరిధిలోని వీర్లపాలెం గ్రామంలో గత కొన్ని సంవత్సరాలుగా టీడీపీలో క్రియాశీలంగా పనిచేస్తున్న కొంతమంది యువకులు, పెద్దలు ఆ పార్టీని వీడి వైఎస్సార్ సీపీలో చేరారు. గురువారం సాయంత్రం వైఎస్సార్ సీపీ గుంటూరు పార్లమెంట్ అభ్యర్థి కిలారి వెంకట రోశయ్య, మంగళగిరి ఎమ్మెల్యే అభ్యర్థి మురుగుడు లావణ్య సమక్షంలో వారు పార్టీలో చేరారు. వారికి కండువాలు కప్పిన నేతలు సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా టీడీపీ మండల ఎస్సీ సెల్ మాజీ నాయకులు నెమలికంటి నవీన్, పులవర్తి రత్నరాజి, పులవర్తి లక్ష్మయ్య, గూబ దయాకర్, నెమలికంటి ప్రభాకర్‌లు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు ఎంతో ప్రాధాన్యత ఇచ్చి వారికి సంక్షేమ పథకాలు అందించడమే కాకుండా రాజ్యాధికారం సైతం ఇస్తున్నారన్నారు. ప్రస్తుతం పార్టీలో చేరిన 50 కుటుంబాలు టీడీపీ ఆవిర్భావం నుంచి ఉన్నారన్నారు. అనంతరం గుంటూరు పార్లమెంట్ అభ్యర్థి కిలారి వెంకట రోశయ్య మాట్లాడుతూ అన్నివర్గాల సంక్షేమం, అభివృద్ధి ధ్యేయంగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. ఎంపీపీ దానబోయిన సంతోష రూపవాణి, జడ్పీటీసీ సభ్యురాలు మేకతోటి అరుణ, నియోజకవర్గ ఎస్సీసెల్ నాయకులు వీరయ్య, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు దానబోయిన వెంకటేశ్వరరావు, పార్టీ మండల అధ్యక్షుడు శృంగారపాటి రత్నం, మార్కెట్ యార్డ్ చైర్మన్ షేక్ బాజీ, వడ్డేశ్వరపు రజనీకాంత్, జాన్సన్, వివిధ గ్రామాల ఎంపీటీసీలు, సర్పంచ్‌లు తదితరులు పాల్గొన్నారు.



ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు కిలారి రోశయ్య, లావణ్యల సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరిన నాయకులు

పన్ను చెల్లింపునకు 'హెల్ప్ డెస్క్'

నెహ్రూనగర్: రాష్ట్ర ప్రభుత్వం ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి (2024–25) సంబంధించిన ఆస్తి పన్నును ముందస్తుగా ఏప్రిల్ నెలాఖరులోపు చెల్లించే వారికి మొత్తం పన్ను పై కల్పించిన 5 శాతం రాయితీకి నగర ప్రజల నుంచి మంచి స్పందన లభిస్తుందని, పన్ను చెల్లింపుదార్లకు వీలుగా సెలవు రోజుల్లోను క్యాష్ కౌంటర్లు పని చేసేలా తగిన ఏర్పాట్లు చేశామని నగర కమిషనర్ కీర్తి చేకూరి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయం, సర్కిల్ కార్యాలయంలో అదనపు క్యాష్ కౌంటర్లు ఏర్పాటు చేయడంతో పాటు భారత్ పేటలోని 140, పెద్ద పలకలూరు రోడ్ లోని 106, వసంతరాయపురం మెయిన్ రోడ్ లోని 148 వార్డ్ సచివాలయాల్లో కూడా క్యాష్ కౌంటర్లు ఏర్పాటు చేశామన్నారు.

తనిఖీల్లో రూ.1.08లక్షలు స్వాధీనం

గుంటూరుఈస్ట్: సరైన పత్రాలు లేకుండా ఓ వ్యక్తి నగదు తీసుకువెళ్తుండగా కొత్తపేట పోలీసులు నగదు స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కొత్తపేట కుగ్లర్ హాస్పటల్ సమీపంలో గురువారం ఫ్లైయింగ్ స్క్వాడ్ కె.జితేంద్ర అనే వ్యక్తిని తనిఖీ చేశారు. అతని వద్ద ఎటువంటి పత్రాలు లేకుండా తీసుకెళుతున్న రూ.1,08,800లు ఉన్నాయి. పోలీసులు నగదును స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేశారు.

మేమంతా సిద్ధం సభను విజయవంతం చేయాలి

వైఎస్సార్ సీపీ పొన్నూరు అభ్యర్థి అంబటి మురళీకృష్ణ

పొన్నూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన మేమంతా సిద్ధం బస్సు యాత్రను విజయవంతం చేయాలని నియోజకవర్గ వైఎస్సార్ సీపీ అభ్యర్థి అంబటి మురళీకృష్ణ అన్నారు. గురువారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సర్పంచులు, నాయకుల సమావేశంలో ఆయన పాల్గొని, మాట్లాడారు. శుక్రవారం సాయంత్రం 3.30గంటలకు ఏటుకూరు బైపాస్‌లో జరిగే మేమంతా సిద్ధం బహిరంగ సభలో నియోజకవర్గం నుంచి అధిక సంఖ్యలో ప్రజలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని కోరారు. జెడ్పీటీసీ సభ్యుడు కర్లపూడి రమేష్, ఏఎంసీ చైర్మన్ ఆకుల వెంకటేశ్వరరావు, పార్టీ నాయకులు షేక్.నాజర్, వట్టిప్రోలు రంగారావు, బొద్దులూరి రంగారావు, వడ్రాణం ప్రసాదు, అమిరినేని సాంబశివరావు, అంబటి వెంకటేశ్వరరావు, బోయి నాగరాజు, దాసరి నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

షెడ్డు నిర్మాణానికి రూ.2.50 లక్షల విరాళం

ప్రత్తిపాడు: అంకమ్మ తల్లి ఆలయంలో షెడ్డు నిర్మాణానికి దాత అదనంగా మరో రూ. 2.50 లక్షల విరాళాన్ని అందించారు. నియోజకవర్గ కేంద్రం ప్రత్తిపాడులో నూతనంగా పునర్నిర్మిస్తున్న అంకమ్మ గుడి ఆవరణలో భక్తుల సౌకర్యార్థం 1500 చదరపు అడుగుల విస్తీర్ణంలో షెడ్డును నిర్మిస్తున్నారు. షెడ్డు నిర్మాణానికి పశ్చిమ గోదావరి జిల్లా తణుకు పట్టణంలో జీవశాస్త్ర ఉపాధ్యాయుడిగా చేస్తున్న రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత ప్రత్తిపాడు వాసి బాపతు మదన గోపాల్‌రెడ్డి, ఎల్ఎఫ్ఎల్ ప్రధానోపాధ్యాయినిగా చేస్తున్న రుద్రమదేవి దంపతులు గత నెల రూ.5 లక్షలు విరాళమిచ్చారు. గురువారం మరో రూ. 2.50 లక్షల నగదు చెక్కును ఆలయ పునర్నిర్మాణ కమిటీ అధ్యక్షుడు బాపతు సాంబశివారెడ్డికి అందజేశారు. తన తల్లిదండ్రులు బాపతు చెన్నారెడ్డి, నాగరత్నమ్మల జ్ఞాపకార్థం షెడ్డు నిర్మాణం నిమిత్తం రూ.7.50లక్షలను ఆలయానికి విరాళమిచ్చినట్లు మదనగోపాల్‌రెడ్డి తెలిపారు. గంగిరెడ్డి నాగమల్లేశ్వరి, మురళీధర్‌రెడ్డి, రజిని, నాగరాజు, బాపతు శ్రీనివాసరెడ్డి, గుండ్లకుంట రామాంజనేయ రెడ్డి, చిన్నపురెడ్డి చిన అంజిరెడ్డి, వెంకటరత్నం, కమిటీ సభ్యులు ఉన్నారు.



ఆలయ కమిటీ సభ్యులకు చెక్కు అందజేస్తున్న మదనగోపాల్ రెడ్డి దంపతులు

క్రీస్తు మార్గం పవిత్రం

కృపా మినిస్ట్రీస్ వ్యవస్థాపక అధ్యక్షుడు బ్రదర్ మ్యాథ్యూస్



గుంటూరు రూరల్: క్రీస్తుని మార్గం ఎంతో పవిత్రమని, ఆయన మార్గంలో నడిచిన వారికి పరలోక రాజ్యం కలుగుతుందని కృపా మినిస్ట్రీస్ వ్యవస్థాపక అధ్యక్షుడు బ్రదర్ మ్యాథ్యూస్ తెలిపారు. గురువారం నల్లపాడులోని మినిస్ట్రీస్ సమీపంలో సువార్త ఉజ్జీవ మహాసభలను ప్రత్యేక ప్రార్థనలు చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా క్రీస్తుని శృతి గీతాలతో క్రీస్తు నామాన్ని ఘనపరిచారు. కార్యక్రమంలో భాగంగా 16వ నూతన గీతాల పాటల ఆల్బమ్ సీడీలు, పాటల పుస్తకాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో బ్రదర్ హోసన్నా, పాస్టర్ డేవిడ్ రాజు, కృపా మినిస్ట్రీస్ సంఘాలు, సేవకులు దేశ నలుమూలల నుంచి క్రీస్తుని భక్తులు వేలాదిగా పాల్గొన్నారు.

వాకర్స్ సమస్యలు పరిష్కరిస్తాం



వాకర్స్‌ను పలకరిస్తున్న మంత్రి రజని, ఎంపీ అభ్యర్థి రోశయ్య

కొరిటెపాడు వాకింగ్ ట్రాక్‌లో మంత్రి రజిని, ఎంపీ అభ్యర్థి రోశయ్య పర్యటన

పట్నంబజారు: రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ గుంటూరు పార్లమెంట్ అభ్యర్థి కిలారి రోశయ్యలు గురువారం కొరిటెపాడులోని వాకింగ్ ట్రాక్‌లో పర్యటించారు. వాకర్స్ సమస్యలు తెలుసుకున్నారు. వాటి పరిష్కారంపై దృష్టి సారిస్తామని తెలిపారు. అనంతరం మంత్రి రజిని, ఎమ్మెల్యే కిలారి రోశయ్యను వాకర్స్ అసోసియేషన్ సభ్యులు దుశ్శాలువతో సత్కరించారు. కార్పొరేటర్ హేమలత, ఆరుమళ్ళ సతీష్‌రెడ్డి, కోటిలింగారెడ్డి, ఓబుల్ రెడ్డి, వెన్నా శ్రీనివాసరెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, దేవరశెట్టి చిన్ని, జయరామిరెడ్డి, కృష్ణారెడ్డి, ఎస్టీ విభాగం జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్లు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

పార్కిన్సన్స్‌పై అవగాహన అవసరం



అవగాహన పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న డాక్టర్ విజయ, పక్కన పలువురు వైద్యులు

సీనియర్ న్యూరాలజిస్ట్ డాక్టర్ పమిడిముక్కల విజయ

గుంటూరు మెడికల్: భారత దేశంలో చాలావేగంగా పార్కిన్సన్స్ వ్యాధి పెరుగుతున్న దృష్ట్యా ప్రతిఒక్కరు వ్యాధిపై అవగాహన కల్గి ఉండాలని సీనియర్ న్యూరాలజిస్ట్, లలితా సూపర్ స్పెషాలిటీస్ హాస్పటల్ న్యూరో సైన్సెస్ డిపార్ట్‌మెంట్ చీఫ్ న్యూరాలజిస్ట్ డాక్టర్ పమిడిముక్కల విజయ అన్నారు. వరల్డ్ పార్కిన్సన్స్ డీసీజ్ అవేర్‌నెస్ డే ను పురస్కరించుకుని గురువారం స్థానిక కొత్తపేటలోని లలితా హాస్పటల్‌లో అవగాహన సదస్సు జరిగింది. సదస్సులో డాక్టర్ విజయ మాట్లాడుతూ నరాల సంబంధిత రుగ్మతల్లో పార్కిన్సన్ వ్యాధి వల్ల చాలా తీవ్రమైన ఇబ్బందులు రోగులు ఎదుర్కొంటారని తెలిపారు. ఈ వ్యాధికి నేడు అత్యాధునిక డీప్ బ్రెయిన్ స్టిమ్యులేషన్(డీబీఎస్) అనే అత్యాధునిక ఆపరేషన్లు అందుబాటులో ఉన్నాయన్నారు. త్వరలోనే తమ ఆస్పత్రిలో ఈ ఆపరేషన్లు ప్రారంభిస్తామని న్యూరోసర్జన్ డాక్టర్ ఎస్.శ్రీనివాసరావు తెలిపారు. తొలుత పార్కిన్సన్స్ బాధితుల కోసం డాక్టర్ విజయ ప్రత్యేకంగా ఓపీని ప్రారంభించారు. డాక్టర్ బి.ఉషాకిరణ్, డాక్టర్ వై.రామచంద్ర, డాక్టర్ శ్రీనివాసరెడ్డి పాల్గొని రోగులు, వారి సహాయకుల సందేహాలను నివృత్తి చేశారు.

14న బీసీ సంఘ రాష్ట్రస్థాయి ప్లీనరీ సమావేశం

నెహ్రూనగర్: బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఈనెల 14న భవిష్యత్ కార్యాచరణపై రాష్ట్రస్థాయి ప్లీనరీ సమావేశాన్ని గుంటూరులోని ఏటుకూరు రోడ్డులో నిర్వహించనున్నట్లు అధ్యక్షుడు కేశన శంకరరావు పేర్కొన్నారు. చుట్టుగుంటలోని సంఘ కార్యాలయంలో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 2024 సార్వత్రిక ఎన్నికల్లో రాజకీయంగా ప్రయాణం ఎటువైపు అనే స్వల్పకాలిక లక్ష్యం పైన, దీర్ఘకాలిక లక్ష్యంగా 2029 ఆపై ఎన్నికలలో రాజకీయంగా ఎలాంటి నిర్ణయాలు తీసుకోవాలనే దానిపై సమగ్రంగా చర్చించాల్సిన అవసరం ఎంతైనా ఉందని తెలిపారు. ప్లీనరీ సమావేశానికి బీసీలంతా హాజరై జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో సంఘ నాయకులు కుమ్మర క్రాంతి కుమార్, కన్నా మాస్టర్, అశోక్ పాల్గొన్నారు.

యువకుడిపై పోక్సో కేసు నమోదు

గుంటూరు ఈస్ట్: బాలికను పెళ్లి చేసుకుంటానన్ని మోసం చేసిన యువకుడిపై అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం నగరానికి చెందిన పి.సాయికిరణ్‌రెడ్డి మైనర్ బాలికకు మాయమాటలు చెప్పి కొద్ది రోజుల క్రితం తన వెంట తీసుకువెళ్లాడు. బాలికను పెళ్లి చేసుకుంటానని చెప్పి మోసం చేశాడు. చివరకు పెళ్ళికి నిరాకరించాడు. బాలిక తల్లి దండ్రుల ఫిర్యాదు మేరకు పోలీసులు గురువారం పోక్సో, ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేశారు.